



EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
గురువారం
31-07-2025
పేజీలు: 02

## భారత్-రష్యా బంధంపై ట్రంప్ విమర్శలు



భారత్-రష్యా బంధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శలు గుప్పించారు. భారత్ వస్తువులపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్.. భారత్-రష్యా మధ్య సన్నిహిత సంబంధాలు, అధిక వాణిజ్యం ఒప్పందాలపై తీవ్రంగా విమర్శించారు. భారత్-రష్యా లావాదేవీల గురించి తాను పట్టించుకోనని..రష్యాతో భారత్ ఏం చేస్తుందో తనకు అనవసరమని అన్నారు.

# కింగ్‌డమ్ మూవీ రివ్యూ



లైఫ్‌లో చావో రేవో డిసైడ్ చేసుకునే సిచ్యువేషన్స్ కొన్ని వస్తుంటాయి. అలాంటి సందర్భంలో అనుకున్నది సాధించినప్పుడు వచ్చే ఆనందం మామూలుగా ఉండదు. అలాంటి సందర్భాలను కళ్లకి కట్టే సీన్ అంటే జెర్సీ సినిమాలోని రైల్వే స్టేషన్ సీన్. ఎన్నాళ్లగానో ఎదురుచూసీ.. చూసీ.. ఎట్టకేలకు తాను హైదరాబాద్ క్రికెట్ టీంకి సెలెక్ట్ కావడంతో ఆ ఆనందాన్ని తట్టుకోలేక ఉబికివస్తున్న కన్నీళ్లను దిగమింగుకుంటూ.. ఖైరతాబాద్ రైల్వే స్టేషన్‌కి వచ్చి నాని అరిచిన అరుపు ఆ సినిమాకే హైలైట్. లైఫ్‌లో పదే పదే ఓడిపోతూ.. కెరియర్ ప్రశ్నార్థకంగా మారిన చాలామందికి ఆ సీన్ ఇన్స్పిరేషన్. ఇప్పుడు విజయ్ దేవరకొండ పరిస్థితి కూడా దాదాపు జెర్సీ సినిమాలో నాని లాంటిదే. హిట్ పడితే ఆయనకి కెరియర్ ఉంటుంది. లేదంటే ప్రశ్నార్థకమే. యాదృచ్ఛికంగా జెర్సీ సినిమా దర్శకుడు గౌతమ్ తిన్ననూరితోనే తన లైఫ్ అండ్ డెత్ మ్యాటర్‌ని తేల్చుకోవడానికి 'కింగ్‌డమ్' చిత్రంతో రెడీ అయ్యారు విజయ్ దేవరకొండ. అయితే మన కొండబాబు కూడా.. రైల్వే స్టేషన్‌కి వెళ్లి బిగ్గరగా అరిచే టైమ్ రానే వచ్చింది. ఈ ఒక్కసారి ఆ వెంకన్నతోడు ఉంటే వెళ్లి టాప్‌లో కూర్చొంటా అని అన్న విజయ్ దేవరకొండ మొర ఆ ఏడుకొండల స్వామికి గట్టిగానే వినబడినట్టు ఉంది.కింగ్డమ్.. గ్యాంగ్‌స్టర్ బ్యాక్ డ్రాప్‌లో ఇద్దరు అన్నదమ్ములు, వాళ్ల చుట్టూ జరిగే సంఘర్షణ. 18 ఏళ్ల క్రితం తన తండ్రిని చంపి ఇంటి నుంచి వెళ్లిపోయిన అన్న శివ (సత్యదేవ్) కోసం తమ్ముడు సూరి (విజయ్ దేవరకొండ) చేసిన పోరాటమే 'కింగ్డమ్' కథ. మనుషుల్ని సైతం రాక్షసులుగా మార్చేసే ప్రాంతంలోకి వెళ్లి.. రాక్షసులందరికీ సూరి ఏవిధంగా రాజయ్యాడు? అన్నదే కింగ్డమ్‌లో అంతర్లీనమైన కథ. 'యాక్టర్ అని ఫీల్ అయ్యే ప్రతి ఒక్కరూ ఒక్కసారైనా గౌతమ్ తిన్ననూరితో డైరెక్ట్ చేయించుకోవాలి. నాలో ఇంత ఉందా? అని మనకి మనకే అనిపిస్తుంది. అంత గొప్ప డైరెక్టర్' అంటూ ఈ సినిమాలో నటించిన సత్యదేవ్ చెప్పిన మాట ఇది. ఈ సినిమా చూశాక.. అతను ఎందుకు ఆ మాట అన్నడో అర్థం అవుతుంది. విజయ్ దేవరకొండ కానీ.. సత్యదేవ్ కానీ.. ఇప్పటి వరకూ చాలా సినిమాలు చేశారు. వాళ్లని వాళ్లు పరిపూర్ణ నటులు అని అనిపించుకోవడానికి ఇంకా కష్టపడుతూనే ఉన్నారు. కానీ ఈ సినిమాతో ఆ ఇద్దరికీ ఆ లోటు తీర్చేశాడు గౌతమ్ తిన్ననూరి. ఈ సినిమాలో విజయ్ ఒక్కడే హీరో కాదు.. సత్యదేవ్‌ని కూడా హీరో స్థాయిలో ప్రాధాన్యత కల్పించడాన్ని బట్టి చూస్తే.. దర్శకుడు కథే హీరో అని గట్టిగా నమ్మారు. ఆ నమ్మకమే నిజం అయ్యింది. కథని నెరేట్ చేయడంలో ఒక్కో దర్శకుడిది ఒక్కో శైలి. రాజమౌళి మాదిరిగా కథ మొత్తం ట్రైలర్‌లోనే చెప్పేసి.. థియేటర్స్ రప్పించే గట్స్ కొందరిలోనే ఉంటాయి. గౌతమ్ తిన్ననూరి కూడా కింగ్‌డమ్ కథ మొత్తాన్ని ట్రైలర్‌లోనే రివీల్ చేశారు. కథ అలా ఉంటుంది.. ఇలా ఉంటుంది.. అంటూ భారీ హైప్ పెంచేసి.. చివరికి థియేటర్స్‌లోకి వెళ్లిన తరువాత కథ సాదాసీదాగా ఉంటే.. ఓస్ ఇంతేనా అని ప్రేక్షకుల నుంచి పెదవి విరుపులు వచ్చేస్తుంటాయి. అలాంటి ఓవర్ హైప్ లేకుండా.. కింగ్ డమ్ కథలో ఏం చూపించబోతున్నాం అనే విషయాన్నిట్రైలర్‌తోనే క్లారిటీ ఇచ్చేసి కింగ్‌డమ్‌ని ప్రచారంతోనే సేఫ్ జోన్‌లో పెట్టారు దర్శక, నిర్మాతలు. 1920లో శ్రీలంకలో కథను మొదలుపెట్టి.. 70 ఏళ్ల తరువాత ఆ కథకి కొనసాగింపుగా ఇద్దరు అన్నదమ్ముల మధ్య అనుబంధాన్ని చూపించడానికి పెద్ద కింగ్డమ్‌నే స్థాపించాడు దర్శకుడు. రాజు ఎవరు అనే ప్రశ్న?? నాకెలా తెలుస్తుంది అనే సమాధానంతో కథలోకి తీసుకుని వెళ్లాడు. సూరిగా విజయ్ దేవరకొండ.. ఓ సాధారణ మధ్యతరగతి కానిస్టేబుల్‌గా ఫస్ట్ సీన్‌తోనే పెర్ఫామెన్స్ పీక్స్ అనిపించాడు. కథలో కన్ఫ్యూజన్ లేకుండా తన అన్నని వెతుక్కుంటూ వెళ్లడంతోనే సూరి పాత్ర ద్వారా కథని మొదలుపెట్టారు. ఎప్పుడెప్పుడు తన అన్నని కలుస్తాడా అనే ఆతృత సూరిలోనే కాకుండా చూసే ప్రేక్షకుల్లో కలిగించడంతో ఫస్టాఫ్ చాలా గ్రిప్పింగ్‌గా ఉంటుంది. ఎప్పుడైతే జైలులో ఉన్న తన అన్న శివని కలుస్తాడో.. అక్కడ నుంచి కథ వేగం పుంజుకుంది. ఆ అన్నదమ్ములిద్దరూ ఎదురుపడే జైలు సీన్ గూస్ బంప్స్ తెప్పిస్తుంది. చావో రేవో తేల్చుకోవాల్సిన పరిస్థితుల్లో పెర్ఫామెన్స్ స్కోప్ ఉన్న పాత్ర పడితే ప్రాణం పెట్టేయొచ్చని.. సూరి పాత్ర ద్వారా తన కెరియర్‌లోనే బెస్ట్ పెర్ఫామెన్స్ ఇచ్చాడు విజయ్ దేవరకొండ. ఫస్టాఫ్‌లో సాధారణ కానిస్టేబుల్‌గా.. ఆ తరువాత స్పై ఆపరేషన్ ఏజెంట్‌గా.. కింగ్డమ్‌కి రాజుగా.. ఇలా మల్టీ లేయర్స్ ఉన్న క్యారెక్టర్‌లో చాలా వేరియేషన్స్ చూపించాడు విజయ్. ముఖ్యంగా ఎమోషనల్ సీన్లలో కొండబాబు కంటతడిపెట్టించాడు. ఈ సినిమాలో సత్యదేవ్.. విజయ్ దేవరకొండకి అన్నగా చేస్తున్నాడని ముందే రివీల్ చేశారు కానీ.. ఇది కేవలం అన్నపాత్ర మాత్రమే కాదు. ఈ సినిమాకి సత్యదేవ్ సెకండ్ హీరోనే. అసలు కింగ్డమ్‌కి రాజు అతనే. అంతటి ప్రాధాన్యత ఉన్న పాత్ర దక్కింది సత్యదేవ్‌కి. ఇద్దరు హీరోలు పోటీ పడి నటించారు. ఫస్టాఫ్‌లో అన్నదమ్ములిద్దరూ కలవడం.. వాళ్లు కింగ్డమ్‌కి వెళ్లడం వరకూ కథ హైరేంజ్‌కి వెళ్లిపోయింది. సెకండాఫ్‌పై అంచనాలు పెంచేస్తుంది. అయితే సెకండాఫ్ కొన్ని చోట్ల నేరేషన్ ఫ్లాట్ అనిపించినా ప్రోపర్ డ్రామా బిల్డ్ చేయడంలో దర్శకుడు సక్సెస్ అయ్యారు. బట్.. క్లైమాక్స్ తేలిపోయినట్టుగా అనిపిస్తుంది. అన్న ఆపదలో ఉంటే తమ్ముడు వచ్చి రక్షించాలి కదా.. అంతా అయిపోయిన తరువాత వస్తే లాభం ఏంటి? అనే ప్రశ్న అయితే రాకపోదు క్లైమాక్స్ చూస్తే. ఈ సినిమా చూస్తున్నంతసేపూ.. తెలుగులో వచ్చిన రెండు మూడు కథల్ని మిక్స్ చేసినట్టుగానే అనిపిస్తుంది. కానీ గౌతమ్ తిన్ననూరి సృష్టించిన 'కింగ్డమ్' సరికొత్తగా అనిపిస్తుంది. క్లైమాక్స్‌కి వచ్చేసరికి ఆ సరికొత్త ప్రపంచం కింగ్డమ్‌లోకి తీసుకుని వెళ్లి మధ్యలోనే వదిలేసినట్టుగా పెదవి విరుపులు అయితే తప్పవు.

## నేను బోల్డ్‌గా ఉండడం పట్ల మహిళలే విమర్శిస్తున్నారు

అనసూయపై సోషల్ మీడియాలో, యూట్యూబ్ చానళ్లలో విమర్శలు వెల్లువెత్తుంటాయి. ముఖ్యంగా ఆమె డ్రెస్సింగ్ స్టైల్ గురించి విమర్శలు ఎక్కువయ్యాయి. దీని గురించి మాట్లాడిన అనసూయ.. ''కొంతమంది మహిళలే నన్ను టార్గెట్ చేస్తున్నారు. వాళ్లతో నాకు ఎలాంటి వ్యక్తిగత పరిచయం లేదు, అయినా నా వ్యక్తిత్వంపై విమర్శలు చేస్తున్నారు'' అని తెలిపారు. నేను తల్లి, భార్య, అయినా నా స్టైల్‌కి తగినట్టు బట్టలు ధరిస్తాను. అందం, స్టైల్, కాన్ఫిడెన్స్ ఇవన్నీ నా వ్యక్తిత్వం లో భాగమే. తల్లిగా ఉండడం అంటే జీవితం లో మిగతావన్నీ వదిలేయాలన్న భావనను నేను ఒప్పుకోను అని ధైర్యంగా స్పందించారు. నా భర్త, నా పిల్లలు నన్ను పూర్తిగా అర్థం చేసుకుంటారు. నన్ను ప్రేమిస్తారు, సపోర్ట్ చేస్తారు. వారు ఎప్పుడూ నన్ను జడ్జ్ చేయలేదు. నేను ఎవరికీ నా విధానం మీద బలవంతం చేయను. నా లైఫ్ ఎలా కావాలో అలా బ్రతకడానికే నాకు హక్కు ఉంది. అదే హక్కు మిగిలిన అందరికీ కూడా ఉంది అని అనసూయ స్పష్టం చేశారు. సమాజం నుంచి వచ్చే విమర్శల మధ్య వ్యక్తిగత ఆత్మవిశ్వాసాన్ని నిలబెట్టుకోవడం చాలా కష్టం. కాని అనసూయ మాత్రం అనేక ఛాలెంజెస్ స్వీకరిస్తూ ముందుకు సాగుతుంది.





## సుప్రీంకోర్టు సంచలన తీర్పు

### 3 నెలల్లో 10 మంది ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కు ఆదేశం

తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్ పై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానమే అనర్హత వేటు వేయాలన్న విజ్ఞప్తిని సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. 'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డైడ్' అన్న సూత్రం వర్తించకూడదని వ్యాఖ్యానించింది. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాము దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకొనేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి, ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యేలు పాడికౌశిర్రెడ్డి, కేపీవివేకానంద, జి. జగదీశ్వరరెడ్డి, పల్లారాజేశ్వర్రెడ్డి, చింతా ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్, భాజపా శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్రెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఏడాది జనవరి 15న దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో తొమ్మిదిసార్లు విచారణకు వచ్చాయి. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్లాతో కూడిన ధర్మాసనం అన్నిపక్షాల వాదనలు విన్న తర్వాత ఏప్రిల్ 3న తీర్పును రిజర్వు చేసింది. ఇందులో ప్రతివాదులుగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్కుమార్, ఎమ్మెల్యేలు పి శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాష్ గౌడ్, ఎ.గాంధీ. గూడెం మహిపాల్రెడ్డి, ఎం.సంజయ్కుమార్లు ఉన్నారు. సుదీర్ఘ వాదనల అనంతరం ఇవాళ తీర్పు వెలువడింది.




నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM




# అభిషేక్ @1

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. భారత స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ ట్రావిస్ హెడ్‌ను అధిగమించి టీ20ల్లో నంబర్ వన్ బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. వెస్టిండీస్‌తో జరిగిన టీ20 సిరీస్ ఆడకపోవడంతో హెడ్ ఒక స్థానం దిగజారి రెండోస్థానానికి పడిపోయాడు. అభిషేక్ కెరీర్‌లో ఇదే అత్యుత్తమ ర్యాంక్ కావడం విశేషం. అంతే కాదు. టెస్ట్, వన్డే, టీ20 మూడు ఫార్మాట్లలో (బ్యాటింగ్, బౌలింగ్, ఆల్‌రౌండర్) భారత ఆటగాళ్లు ఆధిపత్యం కొనసాగిస్తున్నారు. అభిషేక్‌తో పాటు శుభ్‌మాన్ గిల్ వన్డేలలో నంబర్ వన్ బ్యాట్స్‌మగా ఉండగా.. జస్ప్రీత్ బుమ్రా టెస్ట్ బౌలర్లలో నంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు. అదే సమయంలో టెస్ట్ ఆల్ రౌండర్లలో రవీంద్ర జడేజా నంబర్ వన్, టీ20 ఆల్ రౌండర్లలో హార్దిక్ పాండ్యా నంబర్ వన్‌గా ఉన్నారు. జట్టు ర్యాంకింగ్స్‌లో వన్డేలు, టీ20ల్లో భారత జట్టు నెంబర్ వన్‌గా కొనసాగుతున్నది. అభిషేక్ ప్రస్తుతం 829 రేటింగ్ పాయింట్లతో నెంబర్ వన్ స్థానంలో ఉండగా.. ట్రావిస్ హెడ్ 814 రేటింగ్ పాయింట్లతో రెండోస్థానంలో కొనసాగుతున్నాడు. అభిషేక్ శర్మ ఇప్పటి వరకు టీమిండియా తరఫున 17 టీ20 మ్యాచులు ఆడి 33.44 సగటు 193.85 స్ట్రయిక్ రేట్‌తో 535 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, మరో రెండు హాఫ్ సెంచరీలున్నాయి. బౌలింగ్ చేసి ఆరు వికెట్లు పడగొట్టాడు. విధ్వంసక ఓపెనర్‌గా గుర్తింపు పొందిన అభిషేక్.. టీ20ల్లో కీలక ఆటగాడిగా మారాడు. అదే సమయంలో ఐసీసీ టెస్ట్ ఆల్ రౌండర్లలో రెండవ స్థానంలో ఉన్న బంగ్లాదేశ్‌కు చెందిన మెహదీ హసన్ మీరాజ్ కంటే.. టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 117 రేటింగ్ పాయింట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. ఐసీసీ విడుదల చేసిన ప్రకటనలో ఆల్‌రౌండర్ల జాబితాలో నెంబర్ వన్‌గా ఉన్నాడని తెలిపింది. 422 పాయింట్లతో బంగ్లాదేశ్‌కు చెందిన మెహదీ హసన్ మిరాజ్ కంటే 117 పాయింట్లు ముందంజలో ఉన్నాడు. జడేజా ఐదు స్థానాలు ఎగబాకి బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్‌లో 29వ స్థానానికి, బౌలర్లలో ఒక స్థానం 14వ స్థానానికి చేరుకున్నాడు. టెస్ట్ బ్యాట్స్‌మెన్‌లలో వాషింగ్టన్ సుందర్ ఎనిమిది స్థానాలు ఎగబాకి 65వ స్థానానికి చేరుకున్నాడు. మాంచెస్టర్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన నాల్గవ టెస్ట్‌లో జడేజాతో కలిసి ఐదవ వికెట్‌కు 203 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పిన విషయం తెలిసిందే. సుందర్ ఎనిమిది స్థానాలు ఎగబాకి ఆల్ రౌండర్ల జాబితాలో 13వ స్థానానికి చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌లో రెండు వికెట్లు కూడా తీసుకున్నాడు. ఇక టెస్టుల్లో జో రూట్ నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా కొనసాగుతుండగా.. న్యూజిలాండ్‌కు చెందిన కేన్ విలియమ్సన్ రెండవ స్థానంలో ఉన్నాడు. ఇంగ్లాండ్‌కు చెందిన హ్యారీ బ్రూక్ మూడో స్థానంలో ఉన్నాడు. ఇంగ్లాండ్‌కు బ్యాటర్ బెన్ డకెట్ ర్యాంకింగ్ 10వ స్థానానికి చేరుకున్నాడు. జాక్ క్రాలీ 43వ స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ టెస్ట్ ఆల్ రౌండర్ల జాబితాలో మూడు స్థానాలు ఎగబాకి మూడో స్థానానికి చేరుకున్నాడు. డిసెంబర్ 2022 తర్వాత ఇదే అత్యుత్తమ ర్యాంకింగ్. మాంచెస్టర్‌లో ఇంగ్లాండ్ ఆడిన ఏకైక ఇన్నింగ్స్‌లో రూట్ 150 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. స్టోక్స్ ఐదు వికెట్లు తీయడమే కాకుండా 141 పరుగులు చేశాడు.




## చిరుత చిక్కింది..

గత వారం పదిరోజులుగా మంచిరేవుల నుంచి గోల్కొండ పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్న చిరుతపులి ఎట్టకేలకు బోనులో చిక్కింది. మంచిరేవుల ఫారెస్ట్ టెక్ పార్కులో అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోనులో పడింది. దీంతో దానిని మరికాసేట్లో అధికారులు జూపార్కుకు తరలించనున్నారు. రెండు రోజుల క్రిత గోల్కొండ తారామరతి మిలటరీ ప్రాంతం నుంచి పక్కనే ఉన్న అటవీ భూమిలోకి ప్రవేశిస్తుండగా.. మంచిరేవుల అటవీ పార్కులోకి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు చిరుత చిక్కిన విషయం తెలసిందే. దీంతో అధికారులు ఫారెస్ట్ టెక్ పార్కులో బోనులతోపాటు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. కాగా, చిలుకూరి జింకల పార్కు, గ్రేహౌండ్స్ క్యాంపస్, పోలీస్ అకాడమీ, గోల్కొండ మిలటరీ కేంద్రం, మంచిరేవుల అటవీ ప్రాంతం అన్నీ కలిపి సుమారు 20 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతం అటవీ వాతావరణాన్ని పోలి ఉండడంతో చిరుత స్వేచ్ఛగా సంచరిస్తున్నది. ఈ క్రమంలో గత గురువారం తెల్లవారుజామున చిరుత పులిని చూసినట్లు గ్రేహౌండ్స్ క్యాంపు సమీపంలో చూసినట్లు పోలీసులు కానిస్టేబుళ్లు వెల్లడించారు.



## శ్రీశైలం జలాశయానికి భారీగా వరద..

కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం జలాశయంలోకి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుకుంది. దీంతో అధికారులు ప్రాజెక్టు 8 గేట్లను 10 అడుగులు ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహంతో ప్రాజెక్టులోకి ఇన్ ఫ్లో 2,93,609 క్యూసెక్కులుగా ఉండగా.. ఔట్ ఫ్లో 2,82,502 క్యూసెక్కులుగా ఉంది. ఇక, పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 882.80 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది.



## ఆకట్టుకుంటున్న పవర్‌హౌస్ సాంగ్

సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'కూలీ'కి లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రతిష్టాత్మక సన్ పిక్చర్స్ బ్యానర్ నిర్మించిన కూలీలో కింగ్ నాగార్జున పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్‌ఖాన్ మరో ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్లు, టీజర్లు, సాంగ్స్ సినిమాపై భారీ క్రేజ్‌ను నెలకొల్పాయి. చికిటు, మోనికా సాంగ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. తాజాగా మేకర్స్ కూలీ నుంచి పవర్‌హౌస్ సాంగ్ రిలీజ్ చేశారు. రాక్ స్టార్ అనిరుధ్ ఈ పాటని పవర్ ప్యాక్డ్ సెన్సేషనల్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. రాంబాబు గోసాల రాసిన లిరిక్స్ సూపర్ స్టార్ రజనీ ఇమేజ్‌కి సరిగ్గా సరిపోయింది. అరివు, కోరస్ గాత్రం మైమరపిస్తోంది.



## జడ్చర్ల బైపాస్ కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో బైపాస్ ఏర్పాటు చేయాలని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణతో కలిసి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనుపల్లి అనిరుధ్ రెడ్డి, కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని న్యూ ఢిల్లీలోని వారి నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం మహబూబ్ నగర్, జడ్చర్ల లలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, జడ్చర్ల బైపాస్ పూర్తయితే ఈ రెండు నగరాలలో ట్రాఫిక్ సమస్యలు తొలగిపోతాయని, రెండు నగరాలు అభివృద్ధి చెందాలని, ఎక్కువ అవకాశం ఉంటుందని వారు కేంద్ర మంత్రికి వివరించారు. వెంటనే ఆయన సానుకూలంగా స్పందించి వచ్చే బడ్జెట్‌లో కేటాయింపులు చేయిస్తామని హామీ ఇచ్చారని, జోన్ స్టడీ చేసి డిపిఆర్ తయారు చేయాలని సూచించారని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే తెలిపారు.

ఆగస్టు 3న నీట్ పీజీ ప్రవేశ పరీక్ష.. 10 గంటలకు అడ్మిట్ కార్డులు విడుదల

దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు నీట్ పీజీ 2025 పరీక్ష ఆగస్టు 3న జరుగనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ ఇప్పటికే పూర్తిచేసింది. వచ్చే ఆదివారం (ఆగస్టు 3న) ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు పరీక్షను నిర్వహించనుంది. అయితే పరీక్షకు 4 రోజుల ముందు అంటే జూలై 31న అడ్మిట్ కార్డులను ఎన్‌బీఈఎంఎస్ విడుదల చేయనుంది. గురువారం ఉదయం 10 గంటలకు అధికారిక వెబ్‌సైట్ natboard.edu.in లో అందుబాటులో ఉంచనుంది. అభ్యర్థులు తమన హాల్‌టికెట్‌ను తమ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ను ఎంటర్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ పరీక్ష ద్వారా డాక్టర్ ఆఫ్ మెడిసిన్, మాస్టర్ ఆఫ్ సర్జరీ, పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా, పోస్ట్ ఎంబీబీఎస్ డిప్లొమాట్ ఆఫ్ నేషనల్ బోర్డ్ డాక్టరేట్ ఆఫ్ నేషనల్ బోర్డ్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. పరీక్ష రోజున విద్యార్థులను 45 నిమిషాలకు ముందే ఎగ్జామ్ సెంటర్లలోకి అనుమతిస్తారు. దేశవ్యాప్తంగా దాదాపు 2 లక్షల మందికిపైగా విద్యార్థులు నీట్ పీజీ రాయనున్నారు. తెలంగాణ నుంచి సుమారు 10 వేల మంది రాసే అవకాశం ఉన్నట్లు అంచనా. వీరికోసం హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సెప్టెంబర్ 3 నాటికి ఫలితాలు వెలువడనున్నాయి. కాగా, జూన్ 15న రెండు షిఫ్టుల్లో ఈ పరీక్ష జరగాల్సి ఉండగా.. ఒకే షిఫ్టులో నిర్వహించాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో ఎన్‌బీఈఎంఎస్ ఆగస్టు 3కు పరీక్షను వాయిదా వేసింది. గతేడాది దేశంలోని అన్ని మెడికల్ కాలేజీల్లో మొత్తం 25,791 సీట్లను కేటాయించారు.



## బెట్టింగ్ యాప్‌లను ఇక ప్రమోట్ చేయను

బెట్టింగ్ యాప్‌ల ప్రచారంలో తనకు నిర్వాహకుల నుంచి ఎటువంటి డబ్బులు అందలేదని సినీ నటుడు ప్రకాష్ రాజ్ వెల్లడించారు. బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన కేసులో బుధవారం ఆయన ఇడి విచారణకు హాజరయ్యారు. ఐదు గంటల పాటు ఇడి అధికారు లు ప్రకాశ్‌రాజ్‌ను విచారించారు. విచారణ ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇకనుంచి బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేయనని స్పష్టం చేసారు. బెట్టింగ్ యాప్స్ ద్వారా డబ్బు సంపాదించాలని ఎవరూ భావించకూడదని సూచించారు. ఇడి అధికారులు తాను చెప్పిన విషయాలు నమోదు చేసుకున్నారన్నారు. విచారణకు ఇడి అధికారులు తనను మళ్లీ పిలవలేదని తెలిపారు.



## రాశి అందాలు

సింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పా ల్సిన పనిలేదు. తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఇటీవల ఎంట్రీ ఇచ్చిన కొత్త హీరోయిన్లలో ఈ ముద్దుగుమ్మ ఒకరు. 14 ఏళ్ల వయసు లోనే ఓ కమర్షియల్ యాడ్ లో నటించిన ఈ భామ.. మొదట ఎయిర్ హోస్ట్ గా కెరీర్ ను ప్రారంభించింది. ఆ తర్వాత హైదరాబాద్ లో ఉద్యోగం చేసుకుంటూ నటన మీద ఉన్న మక్కువతో సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. 'జెమ్' సినిమాతో తెలుగు తెరకు పరిచమైయన ఈ బ్యూటీ ఆది సాయికుమార్ తో 'శశి' చిత్రంతో గుర్తింపు పొందింది. పోస్టర్, ప్రేమ్ కుమార్ వంటి చిత్రాల్లో అలరించింది. ఈ మధ్య కాలంలో 'భూతద్దం భాస్కర్ నారాయణ'లోనూ మెప్పించింది. ఇది ఇలా ఉంటే రీసెంట్ గా 'ప్రసన్నవద నం, బ్లైండ్ స్పాట్ 'తో ఆడియన్స్ ను పలకరించింది రాశి సింగ్. అయితే మూవీల్లో అంతగా అవకాశాలు రాకపోయినా ఫ్యాన్స్ తో మాత్రం టచ్లోనే ఉంటుంది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే రాశి.. ఎప్ప టికప్పుడు తన లేటెస్ట్ ఫొటోషూట్ లతో ఆకర్షిస్తుంది. చీరలు, మోడరన్ డ్రెస్సుల్లో ఆమె ఫొటోలు తరచూ వైరల్ అవుతుంటాయి.